ఖాళీ జాగా.. వేసేయ్ పాగా.!

- ఆక్రమణలతో కుచించుకుపోతున్న పంట కాలువలు
- రైతులకు సాగునీటి ఇక్కట్లు
- కాగితాలకే పరిమితమవుతున్న ప్రతిపాదనలు

ఉప్పలగుప్తం: కోనసీమ అంటే అందాల సీమ. బంగాళాఖాతం తీరాన్ని ఆనుకుని.. సప్త నదీపాయల మధ్య కొలువైన సీమ. పచ్చని తివాచీ పరిచినట్టు ఉండే చేలు, కొబ్బరితోపులు, గోదావరి నదీపాయలు, వంపులు తిరుగుతూ పారే పంట కాలువలు, తెరచాప పడవలు, మడ అడవులు, గోదావరి మధ్య లంక గ్రామాలు, మండువా లోగిళ్లు. ఇలా చెప్పుకుంటూ పోతే కోనసీమ పర్యాటకాలకు స్వర్గధామం.

ఈ ప్రాంతం ప్రజలు పంటలు పండించుకునేందుకు అనుగుణంగా, సర్వప్రాణులు జీవించే విధంగా నాటి బ్రిటీష్ ప్రభుత్వంలో ఇంజినీర్‌గా పనిచేసిన సర్ ఆర్థర్ కాటన్ పంట కాలువలను ఒక ఆకృతిలో రూపొందించి పుష్కలంగా సాగునీరు, తాగునీరును సముద్రతీర ప్రాంతాలకు తీసుకురావడానికి కారకుడయ్యాడు. ఆ మహనీయుని కృషి ఫలితంగా బీడు భూములకు ఉన్న పొలాలను సాగుచేసి పంటలు పండించుకొని ఈ ప్రాంత ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి బ్రహ్మాండమైన రూపకల్పనకు కొంతమంది ఆక్రమణ దారులు కాలువకు ఇరువైపులా ఉన్న గట్లను ఆక్రమించి కాలువ ఆకృతికి తూట్లు పొడుస్తున్నారు. వ్యాపార, వ్యక్తిగత అవసరాల నిమిత్తం, పశువుల పాకలు, కార్ల షెడ్లు, హిందూ, క్రిస్టియన్ దేవాలయాలు, శాశ్వత కట్టడాలు అనేకమైనవి కాలువ గట్లపై ఆక్రమణదారులు ఆక్రమించుకుంటూ కాలువ ఆకృతి కుంచించుకు పోవడానికి కారకులు అవుతున్నారు. వాటి నుంచి వెలువడే చెత్త చెదారాలను సైతం పంట కాలువల్లో పడేస్తూ నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నారు. దీంతో వ్యవసాయం చేసుకునే రైతులకు, శివారు ప్రాంతాలకు సాగునీరు అందక నీటి ఎద్దటితో సతమతమవుతున్నారు. ఈ కాలువలపై అధికారులు పర్యవేక్షణ కొనసాగుతున్నా ఎన్నడూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై వాటి వెనుక అధికారులకు ఎలాంటి స్వలాభం ఉందోనని ప్రజలు విమర్శిస్తున్నారు.



విలసవిల్లి పంట కాలువపై యథేచ్ఛగా ఆక్రమణలు

జాగా ఉంటే ఆక్రమించాల్సిందే

అమలాపురం నియోజకవర్గంలోని ప్రధాన పంట కాలువ, బ్రాంచ్ కాలువ ఏ కాలువగట్టు చూసిన ఆక్రమణలు అధికంగా కనిపిస్తుంటాయి. కాలువ ప్రక్కన కొద్దిపాటి జాగా ఉన్నా రాత్రికి రాత్రే ఆ ప్రాంతం ఆక్రమణలకు గురవుతుంది. మొదట బతుకు దెరువుకు చిరు వ్యాపారం ప్రారంభించి కాలక్రమేణ కాలువని ఆక్రమించి పెద్ద పెద్ద భవనాలు నిర్మిస్తున్నా.. ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవట్లేదు. ఇదే అదునుగా అధికారులు తమ సిబ్బందితో మూముళ్లు తెప్పించుకుంటున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో భారీ కట్టడాలు నిర్మించినా చర్యలు తీసుకునే వారు ఉండరని ఆక్రమదారుల భావన.



ఈదరపల్లి ప్రధాన పంట కాలువ వెంబడి ఉన్న ఆక్రమణలు

జిల్లా అధికారుల ఆదేశాలు అమలవుతాయా?

అమలాపురం నియోజకవర్గంలో ఉన్న అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల్లోని కాలువగట్లపై ఆక్రమణలు అధికంగా ఉన్నాయి. ఇటీవల కాలంలో జిల్లా ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ మహేష్ కుమార్, జేసీ నిషాంతి సమావేశమై శివారు భూములకు సాగునీరు ఇబ్బంది లేకుండా పంట కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎన్నో ఏళ్లుగా సతమతమవుతున్న సమస్య పరిష్కారమై పంట కాలువలకు పూర్వ వైభోగం రాబోతుందని రైతన్నలు హర్షం వ్యక్తం చేశారు. రోజులు గడుస్తున్నప్పటికీ ఇరిగేషన్ అధికారుల నుంచి ఎలాంటి చర్యలు లేకపోవడంతో అధికారులు ఇచ్చిన ఆదేశాలపై రైతన్నలు పెట్టుకున్న ఆంక్షలు వట్టి నీటి మీద రాతలుగానే మిగులిపోతాయా అని ఆందోళన చెందుతున్నారు. జిల్లా కేంద్రమైన అమలాపురం పరిసర ప్రాంతాల్లో పేరూరు వై-జంక్షన్లో కాలువను ఆక్రమించి రిటైనింగ్ వాల్, ఈదరపల్లి పంట కాలువ పక్కన దుకాణాలు ఏర్పాటు చేశారు.

అధిక సంఖ్యలో అనధికార వంతెనలు

అమలాపురం మండలం నడిపూడి లాకు వద్ద ప్రధాన పంట కాలువ చల్లపల్లి కెనాల్ ఇందుపల్లి కెనాల్‌గా విడిపోయింది. చల్లపల్లి కెనాల్ పొడవునా కామనగరువు, సమనస, సవర్ప్రాలెం, గోపవరం, చల్లపల్లి వరకు కాలువ ఆక్రమణకు గురైంది. కాలువ పొడవునా ఇళ్లు, కట్టడాలు, అనధికారి వంతెనలు అధిక సంఖ్యలో ఉన్నాయి. ఇదే కాలువ విలసవిల్లి వద్ద విడిపోయి విలసవిల్లి నుంచి భీమనపల్లి వరకూ విస్తరించి ఉంది. ఈ కాలువను ఆనుకొని ఉన్న రహదారి పొడవునా వ్యాపార స్థావరాలు, ఇళ్లు, కార్ల షెడ్లు, పశువుల పాకలు, ఇతర ఆక్రమణలు అధికంగా ఉండటంతో పంట కాలువ కుచించుకుపోవడంతో పాటు రోడ్డుపై ప్రయాణించే వారికి ఇబ్బంది కలుగుతుంది. ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, కూనవరం కాలువలపై అనేక వంతెనలున్నాయి. నడిపూడి లాకు నుంచి ఇందుపల్లి మీదుగా బెండమూర్లంక వరకు విస్తరించి బెండా కెనాల్ దారి పొడవునా ఆక్రమణలు ఉన్నాయి.

కాలువగట్టు వెంబడి

బోడసకుర్రు వద్ద ప్రధాన పంట కాలువ పక్కనే నివాసాలు అధికంగా ఉండటంతోపాటు, ఇటీవల కాలంలో రెండస్తుల భారీ భవనాన్ని స్థానికులు నిర్మించారు. దీనిని తొలగించాలని జిల్లా ఇరిగేషన్ అధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ మండల అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఏ ప్రలోభాలకు అధికారులు లోనయ్యారో అని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇవి కాకుండా అల్లవరం, గుండెపూడి, గోడితిప్ప, మొగళ్లమూరు, బెండా కాలువ 1,2 తదితర కాలువలపై ఆక్రమణలున్నాయి. అమలాపురంలో నడిలాకు నుంచి ఇందుపల్లి వరకు కాలువగట్టు వెంబడి ఆక్రమణలు వెలిశాయి. కార్మిక సంఘాలు, వ్యాపారాలు, చిరు వ్యాపారులు కాలువ గట్టుని ఆక్రమించుకున్నారు. వీటిని ఎస్ఈ, డీఈ లాంటి అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. కాలువని ఆక్రమించుకొని కట్టడాలు నిర్మిస్తున్నారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే స్థానికంగా నాయకులు రంగ ప్రవేశం చేసి అధికారుల నోళ్లకి తాళం వేస్తున్నారు. అమలాపురంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు రోజూ ఈ కాలువ వెంబడి తిరుగుతున్నా దీనిపై ఆక్రమణదారులను ప్రశ్నించట్లేదు. ఇంత జరుగుతున్నా పట్టించుకోని అధికారులు కలెక్టర్, జేసీ ఆదేశాలతో ముందుకు వెళ్తారా లేక ఎప్పటిలాగే కాలయాపన చేస్తారా? అనే విషయం ప్రజల్లో ప్రశ్నార్థకంగా మారింది.

రైతులకు ఇబ్బంది కలుగుతుంది



ఎగువ ప్రాంతాల్లో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా పంట కాలువల గట్లను ఆక్రమించడంతో దిగువ ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకునే రైతులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. పూర్వం ఏర్పాటు చేసిన పంట కాలువలు కుచించుకుపోవడంతో సాగు సమయంలో రైతులు సాగునీటి ఎద్దటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయాధిరిత కోనసీమలో సాగు నీరు దొరకకపోతే సాగు జరగదు. పంట కాలువలపై ఆక్రమణలకు ఆదిలోనే అధికారులు అడ్డుకట్ట వేయాలి. ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకొని ఆక్రమణలు తొలగించి వ్యవసాయ భూములను, రైతాంగాన్ని కాపాడాలి.

– అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, రైతు నాయకుడు, గోపవరం.

క్లుప్తంగా

అన్నంపల్లి అక్విడెక్టును తాకిన వరద



అన్నంపల్లి పాత, కొత్త అక్విడెక్టుల మధ్య సుడులు తిరుగుతూ ప్రవహిస్తున్న వరద

ఐ.పోలవరం: గోదావరి వరద ఉధృతి మరింత పెరిగింది. దీని ప్రభావం ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాలపై పడుతోంది. గౌతమీ, వృద్ధ గౌతమీ, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి అధికంగా ఉంది. ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, అమలాపురం, అల్లవరం మండాలల్లో లోతట్టు ప్రాంతాల లంకలను తాకుతూ వరద ప్రవహిస్తోంది. వరద నీరు అన్నంపల్లి పాత, కొత్త అక్విడెక్టులను తాకుతూ ప్రవహిస్తోంది. రాఘవేంద్ర వారధి, ఎదుర్లంక వారధి, బోడసకుర్రు–పాశర్లపూడి వంతెలన వద్ద వరద నీరు సుడులు తిరుగుతూ ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో వరద తగ్గుతోందని తెలిసి స్థానికులు ఊరట చెందుతున్నారు.

వీరేశ్వరుడి ఆలయంలో చిన్నారుల నాట్యం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయంలో చిన్నారులు నాట్యం చేశారు. శ్రీదత్త సాయి కూచిపూడి అకాడమీ ఆధ్వర్యంలో గ్రామంలో చిన్నారులకు కూచిపూడి, భరత నాట్యం శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నలుమూలల నుంచి సుమారు 50 మందిపైగా చిన్నారులు ఏకాదశి మహా పర్వదినం పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో గజ్జలకు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయంలో సామూహిక నాట్య ప్రదర్శన చేశారు.

ఉచిత వైద్య శిబిరం

అమలాపురంరూరల్: మండలంలోని ఈదరపల్లిలో హరి మనోవికాస కేంద్రంలో కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నపిల్లల వైద్యులు, చర్మవ్యాధులు, ఫిజియోథెరపీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ బృందం వైద్యులు దివ్యాంగులకు అన్ని రకాల స్పీచ్‌ఎంఆర్ ఆర్థో విభాగాలను పరీక్షించి మందులు అందించారు. శస్త్ర చికిత్సలు అవసరమైతే ఉచితంగా ఆపరేషన్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హరి మనోవికాస కేంద్రం ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ రాజశేఖర్, డైరెక్టర్ రాజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

తాళ్లరేవు: అటవీ శాఖ ఆధ్వర్యంలో సీబీఈటీ నిధులతో పలు మత్స్యకార గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. గాడిమొగ పంచాయతీ పెదవలసలలో రూ.2 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన పీతల షెడ్, పటవల పంచాయతీ కొత్తూరులో రూ.2 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు దుకాణాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు కామాడి గోవలక్ష్మి, పినపోతు చినకామేశ్వరరావు, ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాదరావు, ఎంపీడీఓ కె.సత్యన్నారాయణ, ఈడీసీ చైర్మన్‌లు బొడ్డు గంగరాజు, చెక్కా నూకరాజు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌లు ధనుంజయ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు అప్పలస్వామి ఆదర్శం

కాట్రేనికోన: దళిత ఉద్యమ నేత, అంబేడ్కర్ స్థాపించిన షెడ్యూల్ క్యాస్ట్ ఫెడరేషన్ తరపున పోటీ చేసి గెలిచిన మొదటి ఎమ్మెల్యే బొజ్జా అప్పలస్వామి దళితులకు ఆదర్శమని దళిత నాయకులు అభిప్రాయపడ్డారు. మండలంలోని కందికుప్ప పంచాయతీ బొజ్జా వారిపేటలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే బొజ్జా అప్పలస్వామి జయంతి వేడుకలు దళిత నాయకులు ఘనంగా చేశారు. నాయకులు మాట్లాడుతూ, అంబేడ్కర్ ఆలోచన విధానాలు, ఆశయాలకు కట్టుబడి ఉద్యమ స్ఫూర్తితో దళితులలో ఉద్యమ స్ఫూర్తిని నింపారన్నారు. ఈ ప్రాంతంలో జరిగిన కూలీ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన ఉద్యమ నాయకుడు అప్పలస్వామి అని జిల్లా దళిత ఉద్యమ నాయకుడు వడ్డి శ్యామ్ ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో వజ్రపు శరత్, బొజ్జా నాని తదితరులు పాల్గొన్నారు.

గోశాల, ఆలయానికి వితరణ

అమలాపురం టౌన్: పట్టణంలోని శ్రీగౌతమ మహర్షి గోసంరక్షణ సమితి గోశాలకు, స్థానిక వంటెద్దు వీధిలో ఉన్న గనికమ్మ ఆలయానికి రూ.10,232 పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వంటెద్దు బాబి మంగళవారం అందజేశారు. కార్యక్రమాల్లో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీను, నియోజకవర్గ పార్టీ కన్వీనర్ అయితాబత్తుల సుభాషిణీ, పీసీసీ నాయకులు చీకట్ల అబ్బాయి, రామకృష్ణారావు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాలి

యానాం: పట్టణంలోని సిద్దార్థ నగర్‌లో కొన్ని నెలలుగా తాగునీటి పైపులైను పగిలి మురుగు నీరు కాలువ నీరు సైతం కలిసిపోయి కుళాయిల ద్వారా ఆ నీరు రావడంతో వాటినే ప్రజలు తాగుతూ వ్యాధుల బారిన పడుతున్నారని మంగళవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాని దినేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమస్యను కొంత కాలంగా స్థానిక పీడబ్ల్యూడీ అధికారులకు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. తక్షణం మురుగునీరు, తాగునీటి పైపులైను కలిసే ప్రదేశాన్ని గుర్తించి పైపులైనుకు మరమ్మతులు చేయాలని అధికారులకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదు



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, కేజీబీవీ ప్రిన్సిపల్ సౌమ్యను వేధింపులకు గురిచేసిన ఆముదాలవలస ఎమ్మెల్యే కోన రవికుమార్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, కూన రవికుమార్ వేధింపులు తాళలేక సౌమ్య ఆత్మహత్యాయత్నం చేసింది. ఎమ్మెల్యే తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారంటూ నాలుగు రోజుల నుంచి మీడియా ముందు వాపోతున్న సౌమ్యని ట్రోల్ చేస్తూ నెగిటివ్‌గా టీడీపీ నేతలు సంబంధిత అకౌంట్లలో పోస్టులు పెట్టడంతో మనస్థాపానికి గురై ఆమె ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఆసుపత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్న సౌమ్యకు న్యాయం చేయాలన్నారు. సౌమ్యకు న్యాయం జరిగే వరకూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాల్సి బాధ్యత కేంద్రం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అలరించిన శ్రీకృష్ణుడి వేషధారణలు



శ్రీకృష్ణుని వేషధారణలో అలరించిన చిన్నారులు

అమలాపురం టౌన్: సంస్కార భారతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక వడ్డిగూడెంలోని శ్రేయ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన గోకులాష్టమి వేడుకల్లో భాగంగా దివ్యాంగ చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణల్లో అలరించారు. సంస్కార భారతి జిల్లా అధ్యక్షురాలు శ్రీగిరి పద్మావతి, ప్రధాన కార్యదర్శి వలవల వెంకటరెడ్డినాయుడు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం దివ్యాంగ పిల్లలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందించి అభినందించారు. పాఠశాల వ్యవస్థాపకుడు శ్రీమన్నారాయణ, అనంతలక్ష్మి దంపతులను సంస్కార భారతి తరపున ఘనంగా సత్కరించారు. చిన్నారులు చేసిన గోకులష్టమి ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, ఐఎంఏ కోనసీమ శాఖ ప్రతినిధి కొప్పినీడి రమణకుమార్, ప్రిన్సిపాల్ కొర్లపాటి దశరధరామయ్య, సంస్కార భారతి సంగీత ప్రముఖ్ మట్టపర్తి చంద్రశేఖర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బందా కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మునిగిన పంట చేలు పరిశీలన

కాట్రేనికోన: భారీ వర్షాలకు నీట మునిగిన పంట చేలను చెయ్యేరులో మంగళవారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా (ఏరువాక) కేంద్ర శాస్త్ర వేత్తల బృందం పరిశీలించింది. ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కో–ఆర్డినేటర్ నంద కిషోర్ రైతులకు సలహాలు, సూచనలు చేశారు. వరినాట్లు వేసిన వెంటనే ముంపునకు గురైతే మనేదలు వేసుకోవాలన్నారు. నీట మునిగిన వరి పిలకలు ఐదు రోజుల వరకు తట్టు కుంటాయని, ముంపు నీటిని బయటకు తీయాలన్నారు. పిలకలు కట్టే దశలో నీట మునిగిన వరి పొలం త్వరగా పుంజుకోవడానికి నీటిని బయటకు తీసి, ఎకరానికి 20 కేజీలు యూరియా, 10–15 పొటాష్ ఎరువులను వేయాలన్నారు. కార్యక్రమంలో ముమ్మడివరం, కాట్రేనికోన మండల వ్యవసాయ అధికారులు మనోహర్, మృథుల తదితరులు పాల్గొన్నారు.

కేఎం నర్సరీ ప్రారంభం

తాళ్లరేవు: ఆంధ్రా– యానాం సరిహద్దులోని కాపుల పాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన కేఎం నర్సరీని యానాం మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్ ప్రారంభించారు. యానాం రిటైర్డ్ అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ కామిశెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ నర్సరీని అఖిల్ తదితరులు ఆసక్తిగా తిలకించారు. యానాం పరిసర ప్రాంత ప్రజలకు వివిధ రకాల అరుదైన మొక్కలు, టిష్యూ కల్చర్ కొబ్బరిమొక్కలు, కాయకూరల విత్తనాలు తక్కువ ధరలకే అందించే ఉద్దేశంతో ఈ నర్సరీని ఏర్పాటు చేసినట్లు వేణుగోపాల్ తెలిపారు. పలువురికి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, ఐ.పోలవరం పుల్లెపు తాతయ్య ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత పుల్లెపు వెంకటేశ్వరరావు, లచ్చిపాలెం సొసైటీ అధ్యక్షుడు మోపూరి వెంకటరెడ్డినాయుడు, జిప్‌మెర్ సీఎంఓ ఆనంద్‌రాజ్, రిటైర్డ్ డైరీ అధికారి పోతుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

గంబూషియా చేపలతో మలేరియాకు చెక్

ఉప్పలగుప్తం: మలేరియా, డెంగీ లార్వాను ఆహారంగా తీసుకునే గంబూషియా చేపలతో మలేరియాను అరికట్టవచ్చని సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు జొన్నాడ శ్రీదుర్గ అన్నారు. మండలంలోని గొల్లవిల్లిలోని రజక చెరువులో పీహెచ్‌సీ వైద్యాధికారి నాగార్జున ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గంబూషియా చేపలను సర్పంచ్ చేతుల మీదుగా మంగళవారం వదిలిపెట్టారు. కార్యక్రమంలో సీహెచ్‌వో విజయలక్ష్మీ, హెల్త్ అసిస్టెంట్లు నాగేశ్వరరావు, జెవివి సత్యనారాయణ, సిబ్బంది కమల, చైతన్య, రాధ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

యానాం: నియోజకవర్గంలోని అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సీఎం రంగస్వామితో సమావేశమయ్యారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ పాఠశాలల్లో అదనపు టీచర్ల నియమాకం, వెంకన్న ఆలయ నిర్మాణం కోసం మొదట విడత ఇచ్చిన మొత్తానికి అదనంగా మరో రూ.కోటి దేవాదాయశాఖ నుంచి ఇవ్వాలని కోరారు. జిప్‌మెర్ ఆసుపత్రిలో పని చేసే నర్సులు, వైద్యులు, స్పెషలిస్టులకు తగిన నివాసవసతి కల్పించడానికి వీలుగా వెటర్నరీ ఆసుపత్రిలో ఉన్న స్థలాన్ని ఇవ్వాలని కోరారు. దరియాలతిప్ప, కనకాలపేట గ్రామాల్లో వెటర్నరీ డిస్పెన్సరీలను అభివృద్ధి చేసి మొబైల్ ఆసుపత్రి ద్వారా సేవలు అందించాలని కోరారు. పాలిటెక్నిక్‌లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులు, సిబ్బందికి ఇవ్వాల్సిన బకాయి వేతనాలు గూరించి చర్చించారు.

ఘనంగా రుద్ర హోమం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రుద్రహోమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత గణపతి పూజ, మండపారాధన అనంతరం రుద్ర హోమం పూర్ణాహుతి కార్యక్రమం జరిపారు. 24 మంది భక్తులు రుద్ర హోమంలో పాల్గొన్నారు. ఏర్పాట్లను సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ పర్యవేక్షించారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం:

మురమళ్ల వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు మంగళవారం కాకినాడ వాస్తవ్యులు చెక్క సాయి వెంకటేష్ రూ.10 వేలు అందించారు. దాతకు స్వామి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు

మస్కిటో డే బ్యానర్ ఆవిష్కరణ

ముమ్మిడివరం: ఈనెల 20న ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించేందుకు వరల్డ్ మస్కిటో డే బ్యానర్‌ను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి దుర్గారావు ఆవిష్కరించారు. ఈ బ్యానర్‌లను జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, యుపీహెచ్‌సీలకు సరఫరా చేస్తామన్నారు. ఆడనాఫిలిస్ దోమ ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని కనుగొన్న శాస్త్రవేత్త రొనాల్డ్‌రోస్ చిత్రపటానికి అన్ని పీహెచ్‌సీల్లో పూల మాల అలంకరణ చేస్తామన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా మలేరియా పట్ల ప్రజలకు అవగహన చేస్తామని జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

అడ్మిషన్లలో మోసాలు గుర్తించాలి

యానాం: పుదుచ్చేరిలో సెంటాక్ ద్వారా జరుగుతున్న ఎంబీబీఎస్ అడ్మిషన్లలో కొందరు నకిలీ నివాస ధ్రువపత్రాలను సమర్పిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం పుదుచ్చేరి రాష్ట్ర విద్యార్థులు, తల్లిదండ్రుల సంక్షేమ సంఘం అధికారులను కోరింది. ఈ మేరకు ఎల్జీ కై లాషనాథన్, సీఎం రంగస్వామి తదితరులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం అసోషియేషన్ అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యయన్ మాట్లాడుతూ, ఈ ఏడాది 1700 దరఖాస్తుల్లో కనీసం 12 దరఖాస్తులు పుదుచ్చేరికి చెందిన వారు కాకుండా తమిళనాడు, కేరళకు చెందిన వారివిగా ఉన్నట్లు నిర్ధారణ అయినట్లు తెలిపారు. అలాంటి అభ్యర్థుల ప్రవేశాన్ని రద్దు చేసి దోషులపై క్రిమినల్ కేసులు పెట్టాలని కోరారు. ఆల్ ఇండియా కోటా, సెంటాక్ జాబితాల్లో రెండింటిలోనూ ముగ్గురు అభ్యర్థులను గుర్తించినట్లు పేర్కొన్నారు. సీబీఐ వంటి సంస్థ ద్వారా సమగ్ర దర్యాప్తు జరిగితేనే అడ్మిషన్లలో మోసాలు గుర్తించవచ్చన్నారు.

నోటిఫికేషన్ విడుదల

అమలాపురం టౌన్: విద్యార్థుల్లో ఫిలాటెలీ, పోస్టల్ స్టాంప్స్‌పై అవగాహన పెంచేందుకు, వారి ఉన్నత విద్యాభ్యాసన తోడ్పాటుకు పోస్టల్ శాఖ ప్రతి ఏటా నిర్వహించే దీన్ దయాళ్ స్పర్ష్ యోజన స్కాలర్ షిప్ పరీక్ష కోసం 2025–26కి సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైనట్లు పోస్టల్ సూపరింటెండెంట్ నవీన్ కుమార్ తెలిపారు. ఈ పరీక్షలో గెలిచిన విద్యార్థులకు ఏటా రూ.6 వేలు ఇస్తున్నామన్నారు. పరీక్షకు 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. మొదటి లెవెల్‌లో విద్యార్థులకు పోస్టల్ సర్కిల్ స్థాయిలో రిటెన్ క్విజ్ ఎగ్జామ్ నిర్వహిస్తారన్నారు. ఈ ఎగ్జామ్ సెప్టెంబర్ 30న జరుగుతుందన్నారు. మొదటి లెవెల్‌లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు రెండో లెవెల్‌కు అర్హత సాధిస్తారని వివరించారు. రెండో లెవెల్‌లో సర్కిల్ స్థాయిలో పోస్టల్ శాఖ ఎంపిక చేసిన టాపిక్‌పై అర్హత సాధించిన విద్యార్థులు ఫిలాటెలీ ప్రాజెక్ట్‌ను తయారు చేయాలి. పోస్టల్ శాఖ నిర్ణయించిన తేదీలోపు ఆ ప్రాజెక్ట్‌ను నివేదించాలి. అలా వచ్చిన ఫిలాటెలీ ప్రాజెక్ట్‌లను పోస్టల్ సర్కిల్ స్థాయిలో ఎవెల్యూషన్ కమిటీ ద్వారా పోస్టల్ శాఖ బెస్ట్ పెర్‌ఫార్మింగ్ ప్రాజెక్ట్‌లను ఎంపిక చేసిన విజేతలైన విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందజేస్తారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులను సెప్టెంబర్ 16 లోపు అందజేయాలి. మరిన్ని వివరాలకు దగ్గరలో ఉన్న సబ్ పోస్టు ఆఫీసు లేదా హెడ్ పోస్టు ఆఫీస్‌లను సంప్రదించాలని సూచించారు.

జ్యూడీషియరీ పరీక్షలకు మార్గదర్శకాలివే

అమలాపురం టౌన్: హైకోర్టు ఉత్తర్వుల మేరకు రాజమహేంద్రవరం జిల్లా జడ్జి ఆదేశాలతో ఈనెల 20 నుంచి 24 వరకూ జరిగే జ్యూడీషియరీ పరీక్షలకు పలు మార్గదర్శకాలను అమలాపురం రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పి.గోవర్ధన్ సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద గేట్లను పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందు మూసివేస్తారని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఐడీ ప్రూఫ్‌లు, ఒరిజినల్ హాల్ టికెట్‌తో పరీక్షా కేంద్రానికి హాజరు కావాలి. పరీక్షలు జరిగే తేదీల్లో అమలాపురం బస్టాండ్ నుంచి పరీక్షా కేంద్రానికి ప్రతి 15 నిమిషాలకు ఒక సర్వీస్ అందుబాటులో ఉంటుంది. పరీక్షా కేంద్రాలకు దగ్గరలోని బస్సులకు రిక్వెస్ట్ స్టాపులు ఏర్పాటు చేశారు. అమలాపురం బస్టాండ్‌లో ఈ పరీక్షల కోసం ఒక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని గోవర్ధన్ వివరించారు. మండలంలోని భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల, చెయ్యేరులోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 22, 23, 24 తేదీల్లో జ్యూడిషరీ పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేసి ఆ దిశగా ఏర్పాట్లు చేశారు.

బాబు మోసాలను ప్రజలకు వివరిద్దాం

ఐ.పోలవరం: బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు అన్నారు. మండలంలోని మురమళ్లలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం పార్టీ నాయకుడు, సర్పంచ్ కాలే రాజబాబు ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. వెంకటపతిరాజు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు బాబు మోసాలను వివరిస్తున్నామని, దీనిపై వారి నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. తమకు జరిగిన మోసాలను మహిళలు కూడా గుర్తిస్తున్నారన్నారు. నియోజకవర్గ పరిశీలకులు మాతా మురళి మాట్లాడుతూ, ముమ్మిడివరం నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ విజయవంతంగా సాగుతోందన్నారు. మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ సారథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్తా రాణి మిరియం జ్యోతి, పార్టీ నాయకులు పెనుమత్స వాసురాజు, జొన్నాడ అజయ్, మట్టపర్తి శివ, వాసంశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మురమళ్లలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

కన్నబాబుకు శ్రీకాంత్ పరామర్శ

అమలాపురం టౌన్: పితృవియోగంతో బాధపడుతున్న కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబును అమలాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు మంగళవారం పరామర్శించారు. కన్నబాబు తండ్రి సత్యనారాయణ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కన్నబాబును పరామర్శిస్తున్న శ్రీకాంత్, శ్రీనివాసరావు

కొబ్బరి పరిశ్రమలను అభివృద్ధి చేయాలి

అమలాపురం రూరల్: జిల్లాలో కొబ్బరి పీచు బొమ్మలు, కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శోభా కారండియాజ్‌ను ఢిల్లీలో ఎంఎస్ఎంఈ పరిశ్రమల ప్రతినిధులు కలిశారు. కోనసీమలో కాయిర్ పరిశ్రమల అభివృద్ధి కోసం చేతి పనుల కార్యకలాపాల అభివృద్ధికి మద్దతు ఇచ్చే కొత్త శిక్షణలు, కాయిర్ ఫోరూమ్ సీఎఫ్‌సీ కేంద్రం ద్వారా మార్కెటింగ్ ఏర్పాటు గురించి చర్చించారు. కాయిర్ విషయాలపై స్పందించిన మంత్రి కాయిర్ సంబంధించిన అధికారి అడిషనల్ ఇన్‌చార్జ్ అరుణ్‌ను కలిసి పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ మహిళా మోర్చా ఆఫీస్ ఇన్‌చార్జ్ దీపిక, అల్లు దుర్గ మణికంఠ పాల్గొన్నారు.



కేంద్రమంత్రితో మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ పరిశ్రమల ప్రతినిధులు

ప్రమాదాల నివారణకు చర్యలు

తాళ్లరేవు: హైవేలో ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, ఏఆర్ ఎస్ఐ బాలాజీ, కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణతో కలిసి తాళ్లరేవు మండలంలోని గురజనాపల్లి నుంచి సుంకరపాలెం జంక్షన్ వరకు రహదారిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, ప్రమాదాల నియంత్రణకు అన్నిచర్యలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా ప్రధాన కూడళ్లలో లైటింగ్ ఏర్పాటు చేయడం కోసం విద్యుత్ శాఖతో మాట్లాడతామన్నారు. ప్రధానంగా రహదారిలో వేగ నియంత్రణ చర్యలు చేపట్టడం, వాహనచోదకులు హెల్మెట్‌లు ధరించే విధంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా ఫొటోగ్రాఫర్స్ దినోత్సవం

కాట్రేనికోన: మండలంలోని కాట్రేనికోన గేటు సెంటర్‌లో మంగళవారం ఫొటోగ్రఫీ పితామహుడు, సృష్టికర్త లూయిస్ జాక్విస్‌మాండ్ డాగూరె జన్మదినాన్ని మండల ఫొటోగ్రాఫర్స్ యూనిన్ అధ్యక్షుడు సంసాని కృష్ణ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఆయన చూపిన బాటలో ఫొటోగ్రాఫర్స్ వృత్తిలో జీవనోపాధి పొందుతున్నామని, ఆయనకు తామంతా రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో ఓలేటి సత్యం, కోలాటి సత్యం, వెంకటరమణ, ముడిదుడ్డి రామారావు, మట్టా నాగేంద్ర తదితరులు ఉన్నారు.

ఉప్పలగుప్తం: ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని మండలంలోని గొల్లవిల్లి భీమేశ్వర ఆడిటోరియంలో లూయిస్ ఫొటో, వీడియో గ్రాఫర్ల యూనియన్ మండల అధ్యక్షుడు దేవరపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లూయిస్ జాక్వెస్ మండే దాగురే చిత్రపటానికి నివాళులర్పించారు. ఫోటోగ్రాఫర్‌ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని యూనియన్ సభ్యులు ఎమ్మెల్యే ఆనందరావుకు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడమి చిన్నవరాజు, స్థానిక సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, ఎంపీటీసీ సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, యూనియన్ జిల్లా అధ్యక్షుడు గెద్దం సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సంగుల దొరబాబు, జిల్లా సభ్యులు బొక్కా పుల్లంశెట్టి, మట్టపర్తి సురేష్, తహసీల్దార్ దివాకర్, ఎంపీడీవో బి.తులసీకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ మంచెం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



డాగురె చిత్రపటానికి నివాళులర్పించిన ఫొటోగ్రాఫర్లు

అమలాపురం రూరల్: మానవుని జీవితంలో ఫొటోగ్రఫీ ఒక భాగమైందని, ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తానని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. ఫొటోగ్రాఫర్ల యూనియన్ అధ్యక్షుడు కట్టమూరి కృష్ణ అధ్యక్షతన నడిపూడి బాబు జగ్జీవన్ రాయి కళ్యాణ మండపంలో ఫొటోగ్రఫీ వేడుకలు మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి నాగేంద్రమణి, ఎమ్మెల్యే ఆనందరావు, మంత్రి సుభాష్, సీనియర్ ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడిగా చెల్లుబోయిన రమేష్, కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు యల్లమిల్లి శివ కుమార్, కోశాధికారి ఉయ్యూరు కోటేశ్వరరావు, గౌరవ సలహాదారులు మోహన్, గురు, జాయింట్ ప్రెసిడెంట్ మెండు రమేష్, జాయింట్ సెక్రెటరీ శివ ష్ణ, కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.